సాక్షి
మంచిర్యాల
శుక్రవారం | 28 | జూలై | 2023


ముల్కల్ల గోదావరి నదిలో నీటమునిగిన ఆలయాలు, ఉధృతంగా ప్రవాహం

తీరప్రాంతం భయం భయం

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- జిల్లాలో పునరావాస కేంద్రాలకు 970 మంది
- కలెక్టర్ బాదావత్ సంతోష్
- వరద ఉధృతి ప్రాంతాల పరిశీలన

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో ఎడతెరిపి లేకుండా భారీ వర్షాల కారణంగా ఎగువ ప్రాంతాల నుంచి వరదనీరు ఉధృతంగా వస్తోందని, అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ నగర్‌లో జిల్లా అదనపు కలెక్టర్ బి.రాహుల్, డీసీపీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్, ట్రెనీ కలెక్టర్ పి.గౌతమి, తహసీల్దార్ రాజేశ్వర్, మున్సిపల్ కమిషనర్ మారుతిప్రసాద్‌తో కలిసి పరిశీలించారు. లోతట్టు ప్రాంత ప్రజల రక్షణ కోసం జిల్లాలో 12 పునరావస కేంద్రాలు, వైద్య శిబిరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజల సహాయార్థం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ 08736 250501 ఏర్పాటు చేశామని అన్నారు.

విద్యుత్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు

జిల్లాలో ఎక్కడైనా విద్యుత్ స్తంభాలు కిందికి ఒరిగినా, విరిగిపోయినా, పడిపోయినా, విద్యుత్ తీగలు వేలాడుతున్న వెంటనే సమాచారం అందించడంతో కోసం కంట్రోల్ రూమ్ నం 79016 28369 ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు.

ప్రజలు పునరావాస కేంద్రాలకు..


పునరావాస కేంద్రంలో నిరాశ్రయులు

జిల్లాలోని జన్నారం మండలం రోటిగూడ, బాదంపల్లి, పొన్కల్ గ్రామాల్లో, సుందరయ్యకాలనీ, తపాల్‌పూర్ గ్రామంలో ఎస్సీ కాలనీలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, తిమ్మాపూర్, నాయకపువాడ, రాంపూర్ గ్రామాల్లో, గొల్లవాడ, ధర్మారం గ్రామం గోండుగూడ, మంచిర్యాల పట్టణంలోని ఎన్టీఆర్ నగర్‌కు భవన నిర్మాణ కార్మిక సంఘ భవనం, దండేపల్లి మండలంలోని గుడిరేవు గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ద్వారక గ్రామం, చెన్నూర్ పట్టణం, హాజీపూర్ మండలం వేంపల్లి గ్రామంలో పునరావాస కేంద్రాలకు 970 మందిని తరలించినట్లు కలెక్టర్ తెలిపారు.

- రికార్డు స్థాయిలో వర్షం
- 82.9 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు
- ఏడు మండలాల్లో 100 మిల్లీమీటర్లపైనే

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో బుధవారం నుంచి గురువారం వరకు కురిసిన భారీ వర్షానికి జనజీవనం స్తంభించింది. గోదావరి, ప్రాణహిత నదులు ఉప్పొంగి ప్రవహిస్తుండడంతో తీరప్రాంత ప్రజలు భయం భయంగా గడపాల్సి వస్తోంది. వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహించాయి. రోడ్లు కోతకు గురయ్యాయి. కడెం, ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి వస్తున్న లక్షల క్యూసెక్కుల వరద నీటితో గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తుండడంతో తీర ప్రాంత వాసులు వరద నీరు ఇళ్లలోకి చేరి బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. ముందస్తుగా మంచిర్యాల గోదావరి సరిహద్దు కాలనీల్లో ప్రజలను ఇళ్లు ఖాళీ చేసి పునరావాస కేంద్రాలకు వెళ్లాలని అధికారులు సూచించారు. జిల్లాలో ఇప్పటికే లోతట్టు ప్రాంతాల్లో వేల ఎకరాలు పంట నీట మునిగి రైతులు ఆందోళన చెందుతున్నారు. రోజుల తరబడి పత్తి మొలకలు నీటిలో ఉండడం వల్ల ఎర్రబారిపోయే ప్రమాదం ఉందని వాపోతున్నారు. ఇప్పటివరకు 11విద్యుత్ స్తంభాలు, వైర్లు, ఒక ట్రాన్స్‌ఫార్మర్ నీట మునగడంతో విద్యుత్ శాఖకు రూ.3లక్షల నుంచి రూ.4లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు గుర్తించారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో లోతట్టు ప్రాంతాల్లోని పంటలకు వాటిల్లిన నష్టాన్ని వ్యవసాయ శాఖ అధికారులు గుర్తించకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

సురక్షిత ప్రాంతాలకు..

గోదావరి తీర ప్రాంత గ్రామాలు, కాలనీల్లో పోలీసు, రెవెన్యూ అధికారులు గురువారం ఉదయం అప్రమత్తం చేశారు. కడెం ప్రాజెక్టుకు వరద పోటెత్తి ప్రమాదకరంగా మారింది. ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి వరద చేరుతుండడంతో 36గేట్లు ఎత్తి లక్షల క్యూసెక్కుల నీటిని గోదావరినదిలోకి వదిలారు. ఎప్పుడు వరద ముంచెత్తుతుందోనని బంధువుల ఇళ్లకు, ఊర్లకు పయనమయ్యారు. గత ఏడాది గోదావరి వరదతో నీటమునిగిన కాలనీవాసులు ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు వెళ్లారు. లక్సెట్టిపేట, హాజీపూర్, మంచిర్యాల, నస్పూర్, ఇందారం, చెన్నూర్, కోటపల్లి, వేమనపల్లి లోతట్టు ప్రాంతాలకు ఎప్పుడు వరద వస్తుందోనని కంటిమీద కునుకు లేకుండా గడిపారు. గురువారం ఉదయం వర్షం కురువగా సాయంత్రం వరకు తెరినిచ్చింది. దీంతో రైతులు, సాధారణ ప్రజలు కాస్త ఊరటచెందారు.


దండేపల్లి: వెల్గనూర్ శివారులో పత్తి చేనులో నిలిచిన నీరు


దండేపల్లి: నర్సాపూర్-మాదాపూర్ వంతెనపై నీరు


ఎల్లంపల్లి ప్రాజెక్టు వద్ద ఎమ్మెల్యే, కలెక్టర్, డీసీపీ


చెన్నూర్‌రూరల్: సుందరసాల-అన్నారం బ్యారేజీ దారిలో..


చెన్నూర్ గోదావరినది పరీవాహక ప్రాంతంలో నీట మునిగిన పంట చేలు

82.9 మిల్లీమీటర్లు వర్షపాతం

జిల్లాలో బుధవారం నుంచి గురువారం వరకు రికార్డు స్థాయి వర్షపాతం నమోదైంది. 82.9 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. నస్పూర్, లక్సెట్టిపేట, దండేపల్లి, జన్నారం, హాజీపూర్, మంచిర్యాల, జైపూర్ మండలాల్లో 100 మిల్లీమీటర్ల పైగా వర్షపాతం నమోదైంది. వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి. రోడ్లపై వర్షపు నీరు ప్రవహించడంతో పలు చోట్ల రాకపోకలు నిలిచిపోయాయి. లోతట్టు ప్రాంతాల్లో డ్రైనేజీ కాలువలు పొంగి ప్రవహించడంతో ఇళ్లలోకి నీరు చేరి ఇబ్బందులు పడ్డారు. జిల్లాలో ఉన్న 846 చెరువులు, చిన్ననీటి ప్రాజెక్టులు మత్తడి దూకి ప్రవహిస్తున్నాయి.

రెట్టింపు వర్షపాతం

వారం రోజుల వ్యవధిలో రెట్టింపు వర్షపాతం నమోదైంది. ఇప్పటివరకు జిల్లా సాధారణ వర్షపాతం 439.6 మిల్లీమీటర్లకు గాను 612.9 మిల్లీమీటర్లు నమోదైంది. 39 శాతం అధికంగా నమోదైంది. ఈ నెల 18 వరకు 305.1 మిల్లీమీటర్లు ఉన్న వర్షపాతం 27న 612.9 మిల్లీమీటర్లకు చేరింది. వారం రోజుల వ్యవధిలో 307 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో లోటు వర్షపాతం ఉన్న మండలాలు అధిక వర్షపాతంలోకి వచ్చాయి. ఈ నెల రెండవ వారం వరకు వర్షాలు లేక గ్రామదేవతలు పూజలు, కప్పతల్లి ఆటలు తదితర పూజలు నిర్వహించారు. ప్రస్తుతం ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పత్తి పంట నీటమునిగి జౌకిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. చెరువులు, కుంటలు నిండడంతో నారుపోసుకున్న రైతులు నాట్లు వేసుకునేందుకు ఎదురు చూస్తున్నారు.

ప్రత్యేక అధికారిగా భారతిహోళ్లికేరి

జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు ప్రత్యేక అధికారిగా రాష్ట్ర శిశు సంక్షేమ శాఖ కమిషనర్ భారతి హోళ్లికేరిని నియమించింది. గతంలో జిల్లాలో పనిచేసిన కలెక్టర్ కావడంతో ఆ అనుభవంతో భారీ వర్షాలు సమయంలో తీసుకున్న జాగ్రత్తలపై జిల్లాకు నియమించారు. భారీ వర్షాలు, వరదల ప్రభావిత ప్రాంతాల్లో ఎలాంటి ప్రాణనష్టం జరకుండా అధికారులకు సూచనలు, సలహాలు అందించేందుకు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమీక్షించనున్నారు.

జిల్లాలో నమోదైన వర్షపాతం

మండలం	మిల్లీమీటర్లు
నస్పూర్	131.3
జన్నారం	102.7
దండేపల్లి	120.6
లక్సెట్టిపేట	123.1
హాజీపూర్	111.4
మంచిర్యాల	118.4
జైపూర్	118.9
మందమర్రి	92.8
కాసిపేట	87.8
కన్నెపెల్లి	83.1
నెన్నెల	80.9
బెల్లంపల్లి	58.7
వేమనపల్లి	55.8
భీమిని	48
తాండూర్	46.5
కోటపల్లి	40.3
భీమారం	36.7
చెన్నూర్	34.5

‘ఎల్లంపల్లి’కి పోటెత్తిన వరద

- ఎనిమిది లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- 8.50 లక్షల క్యూసెక్కులు అవుట్‌ఫ్లో
- 45 గేట్ల ఎత్తివేతతో ఉధృతంగా గోదావరి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): భారీ వర్షాలు, ఎగువ ప్రాంతాల నుంచి వరద కారణంగా ఎల్లంపల్లి ప్రాజెక్టుకు గురువారం నీరు పోటెత్తింది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 20.175 టీఎంసీలకు గాను 16టీఎంసీల నీటిమట్టంతో ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో ఐదు లక్షల క్యూసెక్కులు, కడెం ప్రాజెక్టు నుంచి 2.33లక్షల క్యూసెక్కుల నీరు వస్తోంది. దీంతో హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్’ పథకానికి 284 క్యూసెక్కులు, ప్రాజెక్టు 40 గేట్లు ఎత్తి ఏడు లక్షల క్యూసెక్కుల నీటిని వదిలారు. రాత్రి వరకు 45గేట్లు ఎత్తి 8.5లక్షల క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. దీంతో గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. గేట్లు ఎత్తడం, వరద నీరు వస్తుండడంతో చూసేందుకు పర్యాటకులు తరలి వస్తున్నారు. రూరల్ సీఐ తోట సంజీవ్, ఎస్సై నరేశ్‌కుమార్ పర్యవేక్షిస్తూ ప్రాజెక్ట్‌పై రాకపోకలు పూర్తిగా నిషేధించారు. హాజీపూర్ మండలం ముల్కల్ల గోదావరి వద్ద పుష్కరఘాట్‌తో పాటు శివాలయ, మల్లికార్జున స్వామి ఆలయాలు నీటమునిగాయి.


ఎల్లంపల్లి గేట్లు ఎత్తడంతో వరదనీటి ప్రవాహం

ప్రాజెక్ట్‌ను పర్యవేక్షించిన కలెక్టర్, డీసీపీ

మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, కలెక్టర్ బాదావత్ సంతోష్, డీసీపీ సుధీర్ రాంనాథ్‌కేకన్, ఏసీపీ తిరుపతిరెడ్డి గురువారం ప్రాజెక్ట్‌ను సందర్శించారు. ఎల్లంపల్లి ఈఈ విష్ణుప్రసాద్‌తో ఇన్‌ఫ్లో, అవుట్ ఫ్లో వివరాలతోపాటు ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరనీటి ప్రవాహం, గేట్ల ఎత్తివేతపై తెలుసుకున్నారు. దిగువ ప్రాంతాల్లో చేపట్టాల్సిన రక్షణ చర్యలపై చర్చించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పునరావాస కేంద్రాలు, వైద్య శిబిరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. హాజీపూర్ తహసీల్దార్ రాజలింగు పాల్గొన్నారు.


వేంపల్లిలో ఇళ్లు ఖాళీ చేయిస్తున్న అధికారులు

లోతట్టు ప్రాంత ప్రజల తరలింపు

లోతట్టు ప్రాంతంలోని వేంపల్లి గ్రామస్తులను ముందస్తు చర్యల్లో గురువారం తరలించారు. సర్పంచ్ వోలపు శారద, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సాగి వెంకటేశ్వర్‌రావు, హాజీపూర్ తహసీల్దార్ రాజలింగు, ఎంపీడీఓ అబ్దుల్‌హై, నాయబ్ తహసీల్దార్ హరిత, ఎంపీఓ శ్రీనివాసరెడ్డి, ఎస్సై నరేశ్‌కుమార్ లోతట్టు ప్రాంతాల్లో పర్యటించారు. ఇళ్లను ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు కానీ, మంచిర్యాల బస్టాండ్ పక్కన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసి శిబిరంలో రక్షణ పొందాలని సూచించారు. దీంతో పలువురు స్వచ్ఛందంగా గ్రామం నుంచి ఇళ్లను ఖాళీ చేశారు.

మంచిర్యాలకు వరద ముప్పు

- ఉప్పొంగి ప్రవహిస్తున్న గోదావరి, రాళ్లవాగు
- హెచ్చరికలు జారీ చేసిన పోలీసులు
- లోతట్టు ప్రాంతాలను పరిశీలించిన ఎమ్మెల్యే

మంచిర్యాలటౌన్: మంచిర్యాల పట్టణానికి మరోసా రి వరద ముప్పు పొంచి ఉంది. కడెం, శ్రీరాంసాగర్ ప్రాజెక్టు గేట్లు ఎత్తి వరద నీటిని గోదావరి నదిలోకి వదలడంతో జిల్లా కేంద్రంలోని కాలేజీ రోడ్డు వద్ద గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. పుష్కరఘాట్ మెట్లను దాటి ప్రవహిస్తున్న నీటితో ముప్పు ఏర్పడనుందని పోలీసులు హెచ్చరిస్తున్నారు. ఉద యం వరకు కురిసిన వర్షం , ఆ తర్వాత శాంతించ డం, వాతావరణం పొడిగా మారడంతో గోదావరి నదిని చూసేందుకు పట్టణ ప్రజలు తరలివచ్చారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి పుణ్యస్నానాలకు వచ్చేవారిని పోలీసులు అడ్డుకుని నదిలోకి వెళితే ప్రమాదమని నచ్చజెప్పి పంపించారు. రాళ్లవాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. రంగంపేట్ వెళ్లే కాజ్‌వే పైనుంచి వరద పారుతోంది. రాముని చెరువు, తిలక్‌నగర్, సాయికుంట చెరువుకు వరద నీరు పోటెత్తి, మత్తడి కాలువల ద్వారా పెద్ద ఎత్తున వరద నీరు గోదావరిలో కలుస్తోంది. తోళ్లవాగుకు వరద పోటెత్తి గత ఏడాది స్థానికంగా ఉన్న సాయికుంటలోని ఇళ్లల్లోకి వరద నీరు చేరగా ఆస్తి నష్టం వాటిల్లింది. ఈసారి కూడా తోళ్లవాగుకు వరద పెరుగుతుండడంతో స్థానికులు భయబ్రాంతులకు గురవుతున్నారు. గోదావరి వరద ఉధృతి పెరిగితే ఎన్టీఆర్‌నగర్, రాంనగర్, ఎల్‌ఐసి కాలనీ, సాయికుంట, ఆదిత్య ఎంక్లేవ్, రెడ్డికాలనీ, రాళ్లపేట్, పాతమంచిర్యాల ప్రజల కు ముప్పు పొంచి ఉంది. దీంతో గురువారం ఉదయం నుంచే పోలీసులు ఆయా ప్రాంతాల్లో ప్రమాద హెచ్చరికలు జారీ చేశారు. లోతట్టు ప్రాంత ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని సూచించారు.


ఎన్టీఆర్‌నగర్ ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే


మంచిర్యాలలో కాజ్‌వే పై నుంచి వరదనీరు

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఎన్టీఆర్ నగర్, రాంనగర్‌లోని లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వారికి సేవలు అందించేందుకు ప్రభుత్వ యంత్రాంగం సిద్ధంగా ఉందని ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. లోతట్టు ప్రాంతాల్లో గురువారం ఎమ్మెల్యే స్థానికులకు ధైర్యాన్ని ఇచ్చారు. ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, కమిషనర్ మారుతిప్రసాద్, కౌన్సిలర్ ప్రకాష్‌నాయక్ పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

సమావేశం వాయిదా

మంచిర్యాలటౌన్: జెడ్పీ స్థాయీ కమిటీ సమావేశం వాయిదా పడింది. గురువారం జెడ్పీ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేయగా కోరం లేక వాయిదా వేశారు. జిల్లాలో భారీ వర్షాలతో వరదల కారణంగా జెడ్పీ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్, జెడ్పీటీసీలు, అధికారులు సహాయక చర్యల్లో పాల్గొనడం వల్ల ఎవరూ హాజరు కాలేదని జెడ్పీ సీఈవో కే.నరేందర్ తెలిపారు. మరోసారి సమావేశాన్ని నిర్వహిస్తామని పేర్కొన్నారు.

ఆర్టీసీ బస్సులు నిలిపివేత

మంచిర్యాలఅర్బన్: భారీగా కురుస్తున్న వర్షాలతో వాగులు ప్రవహించడం.. కోతకు గురైన దారుల్లో బస్సుల రాకపోకలు నిలిపివేశారు. ప్రధాన మార్గాల్లోనే ఆర్టీసీ యాజమాన్యం బస్సులు నడుపుతోంది. ఇదివరకు చెన్నూర్ నుంచి కోటపల్లి, వేమనపల్లి మండలాల్లోని పలు గ్రామాలకు నిలిపివేసిన యాజమాన్యం గురువారం ఉదయం నుంచి మరికొన్ని బస్సులు నిలిపివేసింది. నిర్మల్ రూట్లలో ఐదు బస్సులు నిలిపివేశారు. జగిత్యాల రూట్లలో అనంతారం వాగు ఉప్పొంగి ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో జగిత్యాల, నిజామాబాద్ 4, కాటారం, కాళేశ్వరం మూడు బస్సులు, శివ్వారానికి వెళ్లే బస్సులు నిలిపివేశారు. రహదారి బురదమయమై బస్సు దిగపడుతుందని దహెగాం వైపు నిలిపివేశారు. గురువారం వర్షాల కారణంగా బస్సులు నిలిపివేసినట్లు డీఎం రవీంద్రనాథ్ తెలిపారు.

వంటచెరుకు కోసం వచ్చి.. వరదలో చిక్కుకుని..


కొట్టుకువచ్చిన కట్టెలను తెప్పవేస్తున్న దృశ్యం

దండేపల్లి: మండలంలోని ద్వారక గోదావరి నదీ తీరం వద్ద గురువారం వరద నీటిలో కొట్టుకు వస్తున్న వంటచెరుకును తీసుకునేందుకు వచ్చిన వెల్గనూర్‌కు చెందిన సుమారు 15మంది, ద్వారకకు చెందిన 8 మంది వరద నీటిలో చిక్కుకున్నారు. వారిని స్థానికులు, పోలీసులు తాళ్ల సాయంతో బయటకు తీసి రక్షించారు. వరదలో వస్తున్న వంటచెరుకును కొందరు సేకరిస్తున్నారు. ఈ క్రమంలో పాయగా చీలిన గోదావరిలో నీటి ఉధృతి ఒక్కసారిగా పెరిగి వారిని చుట్టుముట్టింది. దీంతో స్థానికులు వారిని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. స్థానికులు, పోలీసులు వారిని బయటకు తీసి రక్షించారు.


బయటకు తీసుకు వస్తున్న స్థానికులు

వంతెన మరమ్మతుకు నిధులు మంజూరు


బ్రిడ్జిని పరిశీలిస్తున్న పంచాయతీరాజ్ డీఈ, ఏఈలు

సాక్షి ఎఫెక్ట్..

నెన్నెల: మండలంలోని గుండ్ల సోమారం వంతెన మరమ్మతులకు బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య రూ.2 లక్షలు మంజూరు చేశారు. ఈ నెల 23న ‘చినుకుతో రోడ్లు ఛిద్రం’ శీర్షికన ‘సాక్షి’లో ప్రచురితమైన కథనానికి జెడ్పీటీసీ శ్యామల, గుండ్ల సోమారం సర్పంచ్ దాడి శంకర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సింగతి రాంచందర్ స్పందించి ఎమ్మెల్యే చిన్నయ్య దృష్టికి వంతెన పరిస్థితిని తీసుకెళ్లారు. గురువారం పీఆర్ డీఈ స్వామిరెడ్డి, ఏఈ శ్రీధర్ వంతెనను పరిశీలించారు. త్వరలోనే వంతెనకు మరమ్మతులు చేపడతామని తెలిపారు.

ప్రత్యేకాధికారి భారతి హోళ్లికేరి పర్యటన

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని పలు లోతట్టు ప్రాంతాలను జిల్లా ప్రత్యేకాధికారి, రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి భారతి హోళ్లికేరి గురువారం రాత్రి పర్యటించారు. రాంనగర్, ఎన్టీఆర్‌నగర్ కాలనీల్లోని ప్రజలతో మాట్లాడి ప్రభుత్వం ద్వారా ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరాలకు తరలివెళ్లాలని సూచించారు. అధైర్య పడవద్దని, గత ఏడాది వరదలను దృష్టిలో ఉంచుకుని, ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని, అందరికీ అండగా ఉంటూ, వరదలను తట్టుకునేందుకు సహకరించాలని అన్నారు. అనంతరం రాళ్లవాగు, కాలేజీరోడ్డులోని గోదావరి నదిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మారుతిప్రసాద్, తహసీల్దార్ రాజేశ్వర్, అధికారులు పాల్గొన్నారు.


రాంనగర్ ప్రజలతో మాట్లాడుతున్న భారతి

వాహనాలు జాగ్రత్తగా నడపాలి


సిబ్బందికి సూచనలు చేస్తున్న ఇంచార్జీ డీటీఓ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): వర్షాకాలంలో అత్యవసరమైతే తప్ప వాహనాలు నడపవద్దని, రోడ్లపై నిల్వనీటిలో మరింత జాగ్రత్తగా వ్యవహరించాలని మంచిర్యాల ఇంచార్జీ డీటీఓ గుర్రం వివేకానందరెడ్డి సూచించారు. భారీ వర్షాల నేపథ్యంలో గురువారం జిల్లా రవాణా శాఖా కార్యాయంలో సిబ్బందితో సమీక్షించారు. ఇంచార్జీ డీటీఓ మాట్లాడుతూ నిల్వ నీటిలో వాహనాలు నడపడం వల్ల అదుపుతప్పే ప్రమాదం ఉందన్నారు. నీటిలో వాహనం, ఎవరైనా చిక్కుకుంటే హెల్ప్‌లైన్ 08736-250501 నంబరు, 100 పోలీస్ నంబరులో సంప్రదించాలని తెలిపారు. ఎంవీఐ రాహుల్‌కుమార్ పాల్గొన్నారు.

సమగ్రశిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి


ఎమ్మెల్యే దివాకర్‌రావుకు వినతిపత్రం

మంచిర్యాలఅర్బన్: తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించి, కనీస వేతన స్కేలు అమలు చేయాలని ఎమ్మెల్యే దివాకర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. అంతకముందు డీఈవో యాదయ్య, కలెక్టర్ కార్యాలయంలో వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం సభ్యులు మౌనిక, స్వప్న, భారతి, మల్లన్న, రాయమల్లు, మహేశ్, మూర్తి, యాదగిరి, శ్రీనివాస్, శేఖర్, రాజన్న, రాకేష్, లక్ష్మణ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఓసీపీలో నిలిచిన ఉత్పత్తి

శ్రీరాంపూర్: వర్షంతో శ్రీరాంపూర్ ఓసీపీలో బొగ్గు ఉత్పత్తి పూర్తిగా స్తంభించింది. ఈ నెల 4నుంచి రెండు, మూడు రోజుల మినహా మిగతా రోజులన్నీ వర్షాలు కురువడంతో ఓసీపీల్లో బొగ్గు ఉత్పత్తికి విఘాతం కలిగింది. బుధవారం రోజంతా ఓసీపీల్లో 192 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. దీంతో గురువారం క్వారీలో వర్షపు నీరు పెద్దయెత్తున చేరింది. అధికారులు నీటిని తోడే పంపులను మునిగిపోకుండా పైకి తరలించారు. మరో చోట బిగించి నీటికి ఎప్పటికప్పుడు బయటకు తరలిస్తున్నారు. రోజువారీ ఉత్పత్తి 12 వేల టన్నులు, ఓబీ 60 వేల క్యూబిక్ మీటర్ల వెలికితీత పనులు పూర్తిగా ఆగిపోయాయి. డంపర్లను పైకి తరలించారు. అధికారులు సమీక్షిస్తూ సహాయక చర్యలు చేపడుతున్నారు.

టీటీసీ విద్యార్థులకు పరీక్షలు

మంచిర్యాలఅర్బన్: వేసవిలో మే, జూన్ 2023లో టెక్నికల్ టీచర్ సర్టిఫికెట్(టీటీసీ) (లోయర్‌గ్రేడ్) కోర్సులో హైదరాబాద్, నల్గొండ, హన్మకొండ, కరీంనగర్ జిల్లాలో 42 రోజులపాటు శిక్షణ పొందిన విద్యార్థులు, గతంలో ఫెయిలైన వారికి ఆగస్టు 12న పరీక్షలు నిర్వహించనున్నట్లు డీఈవో యాదయ్య తెలిపారు. ఎడ్యుకేషనల్ ఫిజికాలజీ అండ్ స్కూల్ అడ్మిస్ట్రేషన్, మెథడ్స్ ఆఫ్ టీచింగ్(జనరల్), మెథడ్స్ ఆఫ్ టీచింగ్(స్పెషల్) పరీక్షలు ఉంటాయని, వివరాలకు డీఈవో కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

క్లుప్తంగా

కేంద్ర మంత్రికి ఆహ్వానం



కేంద్ర మంత్రి గడ్కరీతో ఎంపీ 'సోయం'

కౌటాల(సిర్పూర్): జాతీయ రహదారి నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమానికి రావాలని ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపురావు, బీజేపీ నేత పాల్వాయి హరీశ్‌బాబు గురువారం ఢిల్లీలో కేంద్ర రవాణ శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూ.11 వేల కోట్లతో మంచిర్యాల జిల్లాలోని తాండూరు, భీమిని మండలాల నుండి మహారాష్ట్రలోని గడ్చిరోలి వరకు జాతీయ రహదారి మంజూరైందన్నారు. వారి వెంట నాయకులు చప్పిడి సత్యనారాయణ, ఎల్కరి దామోదర్ ఉన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

- జెడ్పీ వైస్‌చైర్మన్ కోనేరు కృష్ణారావు
- నవోదయ విద్యాలయంలో రాష్ట్రస్థాయి క్లస్టర్ పోటీలు ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కోనేరు కృష్ణారావు

కాగజ్‌నగర్‌టౌన్: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని జెడ్పీ వైస్ చైర్మన్ కోనేరు కృష్ణారావు అన్నారు. పట్టణంలోని త్రిశూల్‌పహాడ్‌లో గల జవహర్ నవోదయ విద్యాలయంలో గురువారం రాష్ట్రస్థాయి క్లస్టర్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. బాస్కెట్‌బాల్, హ్యాండ్ బాల్, వాలీబాల్ అండర్-14, 17, 19 విభాగాల్లో, 'సుబ్రత్ కప్' ఫుట్‌బాల్ అండర్-14, 17 విభాగాల్లో బాలబాలికలకు పోటీలు నిర్వహించడం జరుగుతుందని ప్రిన్సిపాల్ చక్రపాణి తెలిపారు. పోటీలు శుక్రవారం సైతం జరగనున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీఎం యూనిట్ హెడ్ సీకే మిశ్రా, వ్యాయామ ఉపాధ్యాయుడు బి.ప్రదీప్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇద్దరు పిల్లలతో సహా తల్లి అదృశ్యం






లక్ష్మి (ఫైల్) ఆధ్య (ఫైల్) కీర్తన (ఫైల్)

తాండూర్(బెల్లంపల్లి): ఇద్దరు పిల్లలతో మహిళ అదృశ్యమైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఏఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన కొమ్మ రాజ్‌కుమార్ అలియాస్ గట్టుకు అదే గ్రామానికి చెందిన లక్ష్మితో వివాహమైంది. దంపతులకు ఇద్దరు కూతుర్లు ఆధ్య(4), కీర్తన(3) సంతానం. బుధవారం లక్ష్మి తన ఇద్దరు పిల్లలను తీసుకుని ఇంట్లోనుంచి వెళ్లిపోయింది. ఆచూకీ లభించకపోవడంతో లక్ష్మి తండ్రి ముదిగిరి రాజన్న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆచూకీ తెలిసిన వారు పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఏఎస్సై కోరారు. అయితే కుటుంబ కలహాలతోనే మహిళ ఇంట్లో నుంచి వెళ్లిపోయినట్లు తెలుస్తోంది.


క్షీర జలపాతం అందాలు



మంచిర్యాల నుంచి నాగ్‌పూర్ హైవేమార్గంలో ఉన్న అందుగులపేట క్షీర జలపాతం సందర్శకులకు కనువిందు చేస్తోంది. సందర్శకులు తగు జాగ్రత్తలు తీసుకోకుంటే ప్రాణాలకే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది.సంబంధిత శాఖ అధికారులు జలపాతం వద్ద ప్రమాద హెచ్చరిక, సూచనల బోర్డులు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

– మందమర్రిరూరల్(చెన్నూర్)

కనువిందు చేస్తున్న 'ఉల్లిపిట్ట'



ఇటీవల ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో మండలంలోని ఉల్లిపిట్ట జలపాతం జలకళను సంతరించుకుని సందర్శకులకు కనువిందు చేస్తోంది. పదిరోజుల క్రితమే తిర్యాణి మండలంలోని చింతలమాదర, గుండాల జలపాతాలకు నీళ్లు రాగా ఉల్లిపిట్ట జలపాతానికి కొంత ఆలస్యంగా గురువారం నుంచి నీళ్లు వస్తున్నాయి.

– తిర్యాణి(ఆసిఫాబాద్)

ఫిల్టర్ బెడ్‌ను పరిశీలించిన జీఎం



నీటిని పరిశీలిస్తున్న జీఎం మోహన్‌రెడ్డి

సాక్షి ఎఫెక్ట్..

మందమర్రిరూరల్(చెన్నూర్): 'కార్మిక కాలనీల్లో మురుగునీరు' శీర్షికన గురువారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి జీఎం మోహన్‌రెడ్డి స్పందించారు. ఏరియాలోని కేకే-5 గని సమీపంలోని ఫిల్టర్‌బెడ్‌ను అధికారులు, యూనియన్ ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఇసుకను ఎప్పటికప్పుడు మార్చాలని, స్వచ్ఛమైన నీటిని సరఫరా చేయాలని సూచించారు. ఇదిలా ఉండగా మురుగునీరు సరఫరా అవుతోందని ఐఎన్టీయూసీ ఆరోపిస్తే ఫిల్టర్‌బెడ్ సందర్శనకు టీబీజీకేఎస్, ఏఐటీయూసీ నాయకులను వెంట తీసుకెళ్లడంపై ఐఎన్టీయూసీ ప్రధాన కార్యదర్శి కాంపెల్లి సమ్మయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు.

పలు రైళ్ల దారి మళ్లింపు

బెల్లంపల్లి: లక్నో-చెన్నై మధ్య నడిచే (16093) జనతా ఎక్స్‌ప్రెస్ రద్దు చేశారు. కోర్బా నుండి కొచ్చువెల్లి మధ్య నడిచే కోర్బా ఎక్స్‌ప్రెస్ (22647), సికింద్రాబాద్-దానాపూర్ వరకు వెళ్లే దానాపూర్ ఎక్స్‌ప్రెస్ (12791,92), న్యూఢిల్లీ-విశాఖపట్నం మధ్య నడిచే ఏపీ సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్ (20806), చెన్నై నుండి అహ్మదాబాద్ మధ్య నడిచే నవజీవన్ ఎక్స్‌ప్రెస్ (12656), వష్ణోదేవి కాట్రా-చెన్నై సెంట్రల్ మధ్య నడిచే అండమాన్ ఎక్స్‌ప్రెస్ (16032), న్యూఢిల్లీ నుండి త్రివేండ్రం వెళ్లే కేరళ ఎక్స్‌ప్రెస్ (12626), న్యూఢిల్లీ-చెన్నై సెంట్రల్ వరకు రాకపోకలు సాగించే తమిళనాడు ఎక్స్‌ప్రెస్ (12622), జైపూర్-మైసూర్ మధ్య నడిచే మైసూర్ ఎక్స్‌ప్రెస్ (12976), భగత్‌కీ కోటి నుండి తిరుచురాపల్లి మధ్య నడిచే హంసఫర్ ఎక్స్‌ప్రెస్ (20481), న్యూఢిల్లీ-చెన్నై మధ్యన డిచే జీటీ ఎక్స్‌ప్రెస్ (12616), ఓకా నుండి పూరి మధ్య నడిచే పూరి ద్వారకా ఎక్స్‌ప్రెస్(20820) రైళ్లను తాత్కాలికంగా దారి మళ్లించి రాకపోకలు సాగించేలా చర్యలు తీసుకున్నట్లుగా రైల్వే అధికారులు పేర్కొన్నారు.

పాలిటెక్నిక్ స్పాట్ అడ్మిషన్లు వాయిదా

శ్రీరాంపూర్: సీసీసీలోని సింగరేణి పాలిటెక్నికల్ కళాశాలలో మిగిలి ఉన్న సీట్ల కోసం నిర్వహించే స్పాట్ అడ్మిషన్ కౌన్సెలింగ్ ప్రక్రియను వర్షాల కారణంగా వాయిదా వేస్తున్నట్లు కళాశాల యాజమాన్యం గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ నెల 28న జరగాల్సిన స్పాట్‌ను తిరిగి ఆగస్టు 1న నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తుల గడువును కూడా ఈ నెల 31 వరకు పొడిగించినట్లు తెలిపింది.

గోదావరి పరీవాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ బదావత్ సంతోష్



రోటిగూడ గ్రామస్తులతో మాట్లాడుతున్న ఏసీపీ



చెన్నూర్ మండలం పొక్కూరులో వరద పరిస్థితిని సమీక్షిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

చెన్నూర్/చెన్నూర్‌రూరల్: గోదావరి పరీవాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. మండలంలోని పొక్కూరులోకి అన్నారం బ్యారేజీ బ్యాక్ వాటర్ చేరడంతో డీసీపీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్‌తో కలిసి గురువారం గ్రామాన్ని సందర్శించారు. చెన్నూర్ పట్టణ సమీపంలో జాతీయ రహదారి వద్ద ఉన్న బతుకమ్మ వాగును పరిశీలించి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లోతట్టు ప్రాంతాల ప్రజలను వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అధికారులను ఆదేశించారు. అత్యవసరమైతే తప్ప ఎవరూ బయటకు రావద్దని సూచించారు. అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితులను పర్యవేక్షించాలన్నారు. ఎవరైనా ఆపదలో ఉంటే అధికారులకు సమాచారం అందించాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీనివాస్ దేశ్‌పాండే, పొక్కూరు సర్పంచ్ నరేందర్, సుందరసాల సర్పంచ్ పాగె రాజమల్లు ఉన్నారు.

గోదావరి పరీవాహక ప్రజల తరలింపు

జన్నారం(ఖానాపూర్): ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు కడెం ప్రాజెక్టు తెగిపోయే పరిస్థితికి చేరుకోవడం, శ్రీరాంసాగర్ ప్రాజెక్టు 26 గేట్లు ఎత్తివేయడంతో గోదావరికి వరద ఉధృతి పెరుగడం వల్ల జన్నారం మండలంలోని రోటిగూడ, తిమ్మాపూర్ గోదావరి పరీవాహక ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రదేశాలకు తరలించారు. గురువారం ఉదయం 6 గంటలకే సీఐ కృష్ణ, ఎస్సై సతీశ్, తహసీల్దార్ కిషన్ ఆయా గ్రామాలకు వెళ్లి ప్రజలకు నచ్చజెప్పారు.



వేలాలలో ప్రజలతో మాట్లాడుతున్న ఏసీపీ

మంచిర్యాల ఏసీపీ తిరుపతిరెడ్డి రోటిగూడ ముంపు ప్రాంతాల ప్రజలతో మాట్లాడారు. రోటిగూడ నుంచి 30 కుటుంబాలు, తిమ్మాపూర్ నుంచి 10 కుటుంబాలను తరలించినట్లు తహసీల్దార్ కిషన్ తెలిపారు. పునరావాస ప్రజలకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.



సురక్షిత ప్రాంతానికి తరలిస్తున్న సీఐ, తహసీల్దార్

ముంపు ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలి

జైపూర్: మండలంలోని వేలాల, పొనూర్, శివ్వారం గ్రామాల్లోని ముంపుప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని ఏసీపీ నరేందర్ సూచించారు. గోదావరికి పైనుంచి వరద నీరు పోటెత్తడంతో భారీ వరదలు వచ్చే అవకాశం ఉన్నందువల్ల ముందస్తుగా ముంపుప్రాంతాల వారు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలన్నారు. ఆయా గ్రామాల్లో శ్రీరాంపూర్ సీఐ రమేశ్, తహశీల్దార్ మోహన్‌రెడ్డి, ఎస్సై ఉపేందర్ రావు, స్పెషల్ అధికారి ప్రభాకర్‌రావు, ఎంపీడీవో సత్యనారాయణలతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించారు. పెగడపల్లి ఈదులవాగు, టేకుమట్ల పెద్దవాగు ఉధృతంగా ప్రవహిస్తున్నాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

రైళ్ల రాకపోకలకు అంతరాయం

- భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ రద్దు



బల్లార్షా రైల్వేస్టేషన్‌లో నిలిచిన తెలంగాణ ఎక్స్‌ప్రెస్

కాగజ్‌నగర్‌టౌన్: ఇటీవల కురుస్తున్న భారీ వర్షాల కారణంగా రైళ్ల రాకపోకలకు అంతరాయం ఉంటుందని రైల్వేశాఖ అధికారులు తెలిపారు. కాజీపేట నుంచి బల్లార్షా సెక్షన్‌లోని కాజీపేట-హసన్‌పర్తి రోడ్డు రైల్వేస్టేషన్‌ల మధ్యలో వరద నీరు ఉప్పొంగి పట్టాలపైకి వస్తుండడంతో ఈ మార్గంలో నడిచే కొన్నిరైళ్లను పాక్షికంగా, మరికొన్ని పూర్తిగా, మరికొన్ని దారి మళ్లించినట్లు ఆయన పేర్కొన్నారు. కాగజ్‌నగర్ 12757/58 సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలును గురువారం ఘన్‌పూర్ నుంచి కాగజ్‌నగర్ వరకు పాక్షికంగా రద్దు చేశామని, కేవలం ఘన్‌పూర్ నుంచి సికింద్రాబాద్ మధ్య నడుస్తుందన్నారు. 17012 సిర్పూర్ కాగజ్‌నగర్ నుంచి సికింద్రాబాద్ వెళ్లే ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ రైలును పూర్తిగా రద్దు చేశామన్నారు. శుక్రవారం 17011 హైదరాబాద్ నుంచి సిర్పూర్ కాగజ్‌నగర్ వరకు నడిచే ఇంటర్ సిటీ రైలును కూడా ఎగువ మార్గంలో పూర్తిగా రద్దు చేసినట్లేనన్నారు. గురువారం మధ్యాహ్నం 3:35 గంటలకు సికింద్రాబాద్ నుంచి సిర్పూర్ కాగజ్‌నగర్‌కు బయల్దేరే 17233 భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ రైలును పూర్తిగా రద్దు చేశామని, శుక్రవారం ఉదయం సిర్పూర్ కాగజ్‌నగర్ నుంచి సికింద్రాబాద్ వరకు వెళ్లే 17234 భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ రైలును కూడా పూర్తిగా రద్దు చేశామన్నారు. న్యూఢిల్లీ నుంచి హైదరాబాద్ వెళ్లాల్సిన తెలంగాణ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలును అధికారులు బల్లార్ష రైల్వే స్టేషన్‌లో నిలిపివేశారు. తిరిగి చంద్రాపూర్ రైల్వే స్టేషన్ నుంచి నాందేడ్ మీదుగా సికింద్రాబాద్‌కు దారి మళ్లిస్తున్నట్లు సమాచారం. బల్లార్ష-సికింద్రాబాద్ మధ్యలో ప్రయాణికులు బల్లార్ష రైల్వే స్టేషన్‌లో దిగి తమ గమ్యస్థానాలకు వెళ్లేందుకు ప్రత్యామ్నాయ మార్గాల కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

కేజీవీల్స్‌తో పదిలం

- అప్రమత్తతే రక్ష
- ముమ్మరమైన ఖరీఫ్ సాగు పనులు



కేజీవీల్స్‌తో వరి పొలంలో దమ్ము చేస్తున్న డ్రైవర్ (ఫైల్)

చెన్నూర్‌రూరల్: వానాకాలంలో సాగు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. వర్షాలు విస్తారంగా కురుస్తుండడంతో రైతులు నాట్లు వేసేందుకు నారుమళ్లను సిద్ధం చేశారు. ఒక్కోచోట కేజీవీల్స్‌తో దమ్ములు కొట్టిస్తున్నారు. దమ్ము చేసిన అనంతరం నాట్లు వేస్తారు. కేజీవీల్స్‌తో పంట పొలాల్లో నడిపే సమయంలో ప్రమాదాలు జరుగుతుంటాయి. డ్రైవర్ తగు జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాలు నివారించవచ్చు.

ప్రమాదాలకు కారణాలు

చేలల్లో నాటు వేసేముందు నీటితో నిండి అంతా ఒకేలా ఉంటుంది. భూమి ఎక్కడ దిగబడుతుందో, ఎక్కడ దిగబడదో తెలియక పోతే ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఉన్నాయి. పొలంలో నీళ్లు ఉండటంతో ఎక్కడ గుంతలు ఉంటాయో సరిగా తెలియదు. దీంతో కూడా ప్రమాదాలు జరగవచ్చు. పొలంలో దమ్ము చేసే సమయంలో ట్రాక్టర్ చేతి ఎక్స్‌లేటర్ ఎక్కువగా వాడతారు. ఎక్స్‌లేటర్ ఎక్కువగా ఉండటం, ట్రాక్టర్‌ను ఒకవైపు నుంచి మరోవైపునకు మళ్లించేందుకు బ్రేక్ ఉపయోగిస్తారు. వాహనాన్ని క్లచ్‌తోనే నియంత్రించవచ్చు. అనుభవం లేకపోతే బ్రేకులు వేసినా వాహనం ఆగడం లేదని పలువురు ఆందోళన చెందుతారు. కొన్ని సమయాల్లో కేజీవీల్స్‌కు పూర్తిగా మట్టి పడుతుంది. ఆ సమయంలో డ్రైవర్ ఎక్కువ శక్తిని వినియోగిస్తారు. అలాంటప్పుడు ట్రాక్టర్ బోల్తాపడే ప్రమాదం ఉంది. బ్రేకులు సరిగా పడక పోయినా గట్లు ఎక్కినప్పుడు ట్రాక్టర్ బోల్తా పడుతుంది. గట్లు ఎక్కేటప్పుడు అనుభవంతో నడపాలి. ఎక్స్‌లేటర్ ఎక్కువగా ఇస్తే వాహనం తిరగబడే అవకాశాలు ఉన్నాయి.

జాగ్రత్తలు పాటించాలి



పంట పొలాల్లో దమ్ము చేసే సమయంలో కేజీవీల్స్ ట్రాక్టర్‌ను జాగ్రత్తగా నడపాలి. అనుభవం ఉన్న వారు మాత్రమే వాహనం నడపాలి. అలాగే రోడ్లపై కేజీవీల్స్‌తో వెళ్లరాదు.

– జాడి బాపు, ఏడీఏ, చెన్నూర్

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

అనుభవం ఉన్న వారు మాత్రమే కేజీవీల్స్ బిగించిన ట్రాక్టర్ నడపాలి. కేజీవీల్స్ బిగించేటప్పుడు తప్పని సరిగా వెనక చక్రాలకు సమాన స్థాయిలో బరువులను ట్రాక్టర్ ముందు భాగంలో బిగించాలి. బరువు ఎక్కువైతే డీజిల్ ఖర్చు ఎక్కువవుతుందని చాలామంది ముందు బరువులను వాడటం లేదు. ట్రాక్టర్‌ను ఒకే స్పీడ్‌తో నడపాలి. అలాగే పంటపొలంలో విద్యుత్ స్తంభాలు ఉన్నచోట, మూలమలుపుల వద్ద నెమ్మదిగా వెళ్లాలి.

'ఆర్టీసీలో కార్మిక సంఘాలను కొనసాగించాలి'

పాతమంచిర్యాల: ఆర్టీసీలో కార్మిక సంఘాలను కొనసాగించాలని సీపీఐ, ఏఐటీయూసీ, సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ, ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు అన్నారు. జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో గురువారం సేవ్ ఆర్టీసీ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి టి.శ్రీనివాస్, రిటైర్డ్ ఆర్టీసీ కార్మికుడు బాబన్న మాట్లాడుతూ రవాణా రంగంలో పనిచేస్తున్న కార్మికులకు పనిభారం తగ్గించాలన్నారు. ఆర్టీసీలో గుర్తింపు సంఘాల ఎన్నికలు నిర్వహించాలన్నారు. సమావేశంలో పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందె మంగ, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మేకలదాసు, సీపీఐ పట్టణ కార్యదర్శి ఖలిందర్‌ఖాన్, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి లాల్‌కుమార్, నాయకులు మేకల రాములు, ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రీజియన్ కార్యదర్శి విబిరావు, ఆర్టీసీ డిపో అధ్యక్షుడు రాజేశం, కార్యదర్శి శంకర్, సీపీఐ నాయకులు మిట్టపల్లి పౌలు, దేవి పోచన్న ఐఎఫ్‌టీయూ నాయకులు తోకల తిరుపతి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రోగికి ఊపిరిపోసిన జేఎల్‌ఎం

వేమనపల్లి: కిడ్నీ, ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతూ ప్రాణాపాయస్థితిలో ఉన్న రోగికి జేఎల్‌ఎం ఉదయ్‌కుమార్ సమయస్ఫూర్తితో వ్యవహరించి ప్రాణాలు కాపాడారు. వేమనపల్లి మండల కేంద్రానికి చెందిన కట్టికోల సమ్మక్కకు కిడ్నీ ఫెయిల్ కావడంతో తీవ్ర అస్వస్థతకు గురైంది. వైద్యుల సూచన మేరకు మిషన్ సాయంతో ఇంటివద్దే ఆక్సిజన్ అందిస్తున్నారు. బుధవారం రాత్రి భారీ వర్షానికి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మిషన్ పనిచేయకపోవడంతో శ్వాసతీసుకోవడం ఇబ్బందిగా మారింది. బాధితురాలి కుమారుడు వెంకటేశ్ జేఎల్‌ఎం ఉదయ్‌కుమార్‌కు ఫోన్‌చేసి విద్యుత్ పునరుద్ధరించాలని కోరడంతో వర్షాన్ని కూడా లెక్కచేయకుండా ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న సబ్‌స్టేషన్‌కు బైక్‌పై వెళ్లాడు. సాంకేతిక సమస్యను సరిచేసి విద్యుత్ సరఫరా అందించారు. అర్ధరాత్రి స్పందించి విద్యుత్ సరఫరా అందజేసి రోగికి ఊపిరి పోసిన జేఎల్‌ఎంను పలువురు అభినందించారు.

సేవలకు సలాం

వేమనపల్లి: ఇటీవల కురుస్తున్న వర్షాలకు మల్లంపేట అటవీ ప్రాంతంలో కల్వర్టుపై మట్టి కోతకు గురికావడమే కాకుండా రహదారిపై భారీ వృక్షం పడిపోవడంతో 35 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. నీల్వాయి ఎస్సై సుబ్బారావు , సర్పంచ్ గాలి మధు, అటవీ సిబ్బందితో కలిసి జేసీబీ సాయంతో చెట్టును తొలగించారు. ట్రాక్టర్లతో కంకర తీసుకొచ్చి కల్వర్టుపై పోయించారు.

పార్వతి బ్యారేజీ 70 గేట్లు ఎత్తివేత

జైపూర్(చెన్నూర్): జైపూర్ మండలం రొమ్మిపూర్ సమీపంలో గల పార్వతి (సుందిళ్ల) బ్యారేజీ 70 గేట్లను గురువారం ఎత్తివేసి నీటిని కిందకు వదిలారు. కాళేశ్వరం బ్యారేజీలో నీటి ప్రవాహం ఎక్కువ కావడం, ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి వరద పోటెత్తడంతో పార్వతి బ్యారేజీలోకి భారీగా నీరు వచ్చిచేరుతోంది. దీంతో బ్యారేజీ 70గేట్లను ఎత్తివేసి 6లక్షల 65వేల క్యూసెక్కుల నీటిని అన్నారం బ్యారేజీలోకి విడుదల చేశారు. గోదావరిలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉందని, సమీప ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

వాగులో కొట్టుకుపోయి రెండు ఎడ్లు మృతి

భీమారం(చెన్నూర్): మండలంలోని రెడ్డిపల్లి గ్రామ సమీపంలోని ఒర్రె వాగులో దాసరి చందు, చెన్నూరు శంకర్‌లకు చెందిన రెండు ఎడ్లు కొట్టుకుపోయి మృతి చెందాయి. ప్రతీరోజు మాదిరిగానే బుధవారం మేతకు వెళ్లిన ఎడ్లు తిరిగి వస్తూ వాగు దాటే క్రమంలో గల్లంతయ్యాయి. గురువారం ఉదయం మృతిచెంది కనిపించాయి. వ్యవసాయానికి ఉపయోగించే ఎడ్లు మృతి చెందడంతో తాము దిక్కుతోచని స్థితిలో పడ్డామని ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరారు.

ఓసీపీల్లో ఇబ్బందులపై డైరెక్టర్ల సమీక్ష



సమావేశంలో పాల్గొన్న జీఎం, అధికారులు

శ్రీరాంపూర్: ఇటీవల కురుస్తున్న వర్షాలతో ఓపెన్ కాస్టు ప్రాజెక్టుల్లో ఎదురవుతున్న ఇబ్బందులపై కంపెనీ డైరెక్టర్లు గురువారం అన్ని ఏరియాల జీఎంలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. వర్షపునీరు క్వారీలో చేరకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డైరెక్టర్లు ఎన్వీకే శ్రీనివాస్(ఆపరేషన్స్), జీ.వెంకటేశ్వర్‌రెడ్డి(పీపీ) సూచనలు చేశారు. వర్షంతో బొగ్గు ఉత్పత్తి నష్టం, ఆగిన ఓబీ వెలికితీత పనుల వివరాలను జీఎం సంజీవరెడ్డి డైరెక్టర్లకు వివరించారు. సమావేశంలో ఎస్‌వోటూ జీఎం రఘుకుమార్, ఇందారం ఓసీపీ పీవో శ్రీనివాస్, ఏజెంట్లు రాముడు, గోపాల్‌సింగ్, డీజీఎం చిరంజీవి, క్వాలిటీ మేనేజర్ వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

కుమురంభీం విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఆదివాసీ నాయకులు

కాసిపేట: మండలంలోని దేవాపూర్‌లో గురువారం ఆదివాసీ పోరాట వీరుడు కుమురంభీం విగ్రహం ఏర్పాటుకు భూమిపూజ చేశారు. ఓరియంట్ సిమెంట్ కంపెనీ స్థలంలో ఏర్పాటు చేయడంతో కంపెనీ అధికారులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో ఇరువురి మధ్య వాగ్వివాదం జరిగింది. రెండేళ్లుగా దేవాపూర్ ప్రవేశం వద్ద భీం విగ్రహం ఏర్పాటు చేసుకునేందుకు ఆదివాసీలు యాజమాన్యాన్ని కోరుతుండగా పట్టించుకోకుండా వ్యవహరించింది. దీంతో విగ్రహం ఏర్పాటుకు భూమి పూజ చేసేందుకు సిద్ధపడి కార్యక్రమం ప్రారంభించారు. విషయం తెలుసుకున్న అధికారులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్సై ఆంజనేయులు అక్కడికి చేరుకుని నచ్చజెప్పేందుకు యత్నించినా ఆదివాసీ సంఘాల నాయకులు వినలేదు. ఆదివాసీలు ఆందోళనకు దిగడంతో అధికారులు వెనుదిరిగారు.